


ఏడు కొండల వాస శ్రీ వేంకటేశా అలిమేలు మంగ శ్రీ ఆకాశ గంగా! ఓ ఆకాశ గంగా..

సరస్వతి వీణారవంతో మేఘుడు ద్రవించినట్లున్నాడు. మెల్లగా ప్రారంభమైన వాన కుంభ వర్షమైపోయింది. వాన కురుస్తున్నంతసేపూ కడింటి పిచ్చయ్యకు అతని యెదురింటి వెంగయ్యకు జరుగుతున్న జగడాన్ని యెవ్వరూ గుర్తించనే లేదు.

కడింటి పిచ్చయ్య కత్తితో పొడిచాడు. వెంగయ్య తక్షణమే చనిపోయాడు. పత్తేవారి వీధిలో ప్రతి ఒక్కరూ కాకపోయినా చాలామంది చూచారు. ఆ చూచిన వారిలో సరస్వతి కూడా వున్నది. సాయంకాలం భానుమూర్తి యింటికి రాగానే ఆ దారుణమైన వార్తను చెవిలో వేసింది. భానుమూర్తికి తెలియదనా? నీకెందుకులే అంటూ ఆఫీసు గదికి వెళ్లి పోయాడు.

వారం దాటగానే భానుమూర్తి కడింటి పిచ్చయ్య పక్షం వకాల్తా పుచ్చుకున్నాడు. సరస్వతికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఇదేం ఉద్యోగం? ఈ ఆదాయంతో బ్రతకడం కంటే బిచ్చమెత్తుకొంటేనేం! గత మాసం జంగాల వీధిలోని బసవన్న మేడలో దొంగలు పడి పదివేలు దోచుకపోతే ఆ దొంగల పక్షం వకాల్తా తీసుకుని కోర్టుకు వెళ్లాడా! ఆ కేసూ కొట్టేశారు. ఆ ముందువారమే ఒక నర్సుపై అఘాయిత్యానికి తలపడ్డ ఇద్దరు రౌడీల తరపున హాజరయ్యాడు. వారూ తప్పుకున్నారు.పెండ్లయినప్పటి నుంచి ఇలాంటి కేసులు తొంభై. ఎక్కడో జరిగిన వాటిని గురించి తానంతగా బాధపడకపోయినా కళ్లముందే సంభవించిన ఈ హత్యాకాండలో హంతకుని తరపున తన భర్తే న్యాయవాది కావడం తనకమితమైన ఆవేదనను కల్గిస్తున్నది. ఏవో మాటల సందర్భంలో ఇలాంటి విషయాలను గురించి ప్రస్తావిస్తే 'నీకేం తెలుసు న్యాయశాస్త్రం. ఇది వృత్తి ధర్మం. ఊరుకో ' అంటాడు భానుమూర్తి. భానుమూర్తి బోర్డు కట్టి నాలుగేండ్లయినా పూర్తి కాకుండానే నలభై వేలార్జించాడు. పదిమంది యెదుట ప్రతిజ్ఞ చేసి పట్టపగలే తల తరిగినా భానుమూర్తిని కుదుర్చుకుంటే చాలు . పదివేలైనా నష్టమేముంది? అట్టా స్పష్టంగా అనేవారు లేకపోయినా అంతటి ధీమా మాత్రం ఆ ప్రాంత మంతా పాదుకుపోయింది.

సరస్వతి పేరుకు తగ్గట్టు గాకున్నా కొద్దిగా చదువుకుంది. ఆమె పరిజ్ఞాన మత్యంత పరిమితమైనది కావచ్చు కానీ ఆలోచనలకు

మాత్రం అవధుల్లేవు. '

***న్యాయాన్ని గురించి వాదించినపుడు గదా మీరు న్యాయవాదులు. నాకు తెలిసి మీరు అన్యాయస్థుల పక్షమే వహిస్తున్నారు. గనుక అన్యాయవాదు'లన్నది సరస్వతి భానుమూర్తికి కాఫీ నిస్తూ.***

'న్యాయవాదంటే న్యాయమును వ్యాఖ్యానించేవాడే వెర్రిదానా' అన్నాడు భానుమూర్తి. 'ఐతే న్యాయవ్యాఖ్యాత' అనండి. 'న్యాయవాదిననడం అన్యాయం అంటూ రెట్టించింది' సరస్వతి.

***'నీకు తెలియదు సరస్వతీ వక్కీలు వృత్తే అంత.అన్యాయాన్ని న్యాయంగా , అన్యాయాన్ని న్యాయంగా , ధర్మాన్ని అధర్మంగా , అధర్మాన్ని ధర్మంగా , నీతిని అవినీతిగా, అవినీతిని నీతిగా , నిజాన్ని అబద్ధంగా , అబద్ధాన్ని నిజంగా నిరూపించగలవాడే లాయరు. లాయరన్నా లైయ్యరన్నా ఒకటే నమ్మ' అంటు మొదలు పెట్టాడు మామ చక్రపాణి.***

సరస్వతి అరటికాయలు తరుగుతూ వింటున్నది.

'మన రాజనీతిలో సహితం అపరాధులు శిక్షించపడకుంటే ఆ పాపం రాజుకు చెందుతుందనిలేదమ్మా.'

'ఇంకా ఏముంది రాజనీతిలో?' అమాయకంగా ప్రశ్నించింది సరస్వతి.

'అపరాధులు తప్పుకున్నా ప్రమాదం లేదు. నిరపరాధులు మాత్రం శిక్షించబడితే రాజవంశమే నశిస్తుందని ఉందమ్మా.

***'అవునవును. దొంగలకూ హంతకులకూ బుద్ధి బలాన్ని అమ్ముకోవడం ఆ సంపాదనతో జీవించడం వృత్తి ధర్మం. బాగానే వుంది మామయ్యా. నాకు తెలియక అడుగుతాను. అదే దొంగలకూ హంతకులకూ కండబలం వున్నవాడు తోడ్పడితే శిక్షార్హుడా?'***

'ఈ ధర్మ సూత్రాలన్ని నీకర్థం కావు సరస్వతీ! ధర్మవ్యాధుని కథ చదివావా? ఎవరి వృత్తి వారిది గదా! నువ్వూ 'లా' చదివి వుంటే యిట్లా మాట్లాడవు.'

'లా' చదివినవారల్లా న్యాయాన్ని న్యాయమనే చెబుతున్నారనా మీ భావం?'

'ఆం. అదే .. అదే అట్లా చెబితే కోర్టులే వుండవు. మనవాడికి సంపాదనా వుండదు. 'అన్నాడు చక్రపాణి

వెంగయ్య హత్యకేసు ఆరుమాసాలు జరిగింది. అందరూ అనుకున్నట్లే ఎగిరి పోయింది ఎర్రగడ్డ పొట్టులాగా. భానుమూర్తి పేరు



కె.సభా(1923-1980)

రాయలసీమలో తొలి కథకుడిగా ప్రసిద్ది చెందిన కె.సభాగారు చిత్తూరు జిల్లాలో అరగొండ సమీపం కొట్రకోనలో 1923వ సంవత్సరం జూలై 1వ తేది జన్మించారు. ఆంధ్ర ప్రభ సచిత్ర వార పత్రికలో సహ సంపాదకుడుగా కొద్దికాలం మదరాసులో గడిపారు. చిత్తూరుకు తిరిగి వచ్చి "దేవదత్తం" అనే పత్రికను చాలా కాలం నడిపారు. దాదాపు 300 కథలనూ ఎన్నో కవితలనూ రాశారు. అవధానాలు చేశారు. తిరువణ్ణామలైలో నివసించిన చలంగారికి ఆంతరంగిక స్నేహితుడయ్యారు. చిత్తూరు జిల్లాలోని అనేక ప్రాంతాలను నేపథ్యంగా స్వీకరించి ఆయన రాసిన కథలు "నీటి దీపాలు" "పాతాళ గంగ" మొదలైన కథా సంపుటాలుగా వెలువడ్డాయి. ఆయన రాసిన బాల సాహిత్యం అపురూపమైనది. చిత్తూరు జిల్లాకు చెందిన సమకాలీన సాంఘీక పరిస్థితులను గురించి ఆయన తనదైన నిరలంకారమైన గొప్పశైలిలో పటిష్టమైన శిల్పంతో అనేక కథలు రాశారు. అందులో "తిరుమల"కు చేరిన "ఆకాశ గంగ" ఒకటి. ఈ కథ 1968 ఫిబ్రవరి నెలలో ఆంధ్రసచిత్ర వారపత్రికలోప్రచురించబడింది.

పాపం పుణ్యం అనే మీమాంసలు తన వృత్తి ధర్మంలోకి చేరవని , దగ్గర కొచ్చిన కక్షిదారులనంతా కాపాడి ధనార్జన చేయడమే తన ధర్మమనే భావించిన భానుమూర్తి కథ ఇది. అతడి భార్య పెద్దగా చదువుకోకపోయినా అతడిలో ధర్మాధర్మ విచక్షణను కలిగించడానికి ప్రయత్నించి విఫలురాలైపోతుంది. భగవంతుణ్ణి నీతి , ధర్మం న్యాయం మొదలైన గొప్ప మానవీయ విలువల్లో సందర్శించిన అతడి భార్య అతడి తప్పుకు విధించిన శిక్షేమిటి ?

కె.సభాగారు రాసిన ఈ పదిపేజీల చిన్నకథ డాస్టోవిస్కీ రాసిన "నేరము-శిక్ష"నవలను స్ఫురింపచేయడంతో బాటూ , భారతీయమైన గొప్ప తాత్విక చింతనకు భూమికగానూ తయారయ్యింది. తిరుమల ఆలయం నేపథ్యంలో చరిత్రలో జరిగిన అనేకానేక గాథల్నీ, కథల్నీ జ్ఞాపకం చేస్తుంది.

ప్రతిష్టలు నేల నాలుగు చెరగులా ప్రాకిపోయింది. పదిమందీ చూస్తుండగానే పట్టపగలే జరిగిన ఖూనీ కేసులో పిచ్చయ్య తప్పుకోవడమంటే సామాన్యమా?

జడ్జిమెంటును విన్న నాటి రేయి సరస్వతి జాగరణ చేసింది. ఈ పాపం నుంచి భానుమూర్తిని తప్పించమని ఏడుకొండల వానిని వేడుకున్నది. 'ఏడు కొండల వాస శ్రీ వేంకటేశా! అలిమేలు మంగ శ్రీ ఆకాశగంగ' పాడుతూ పాడుతూ ఉన్నట్టుండి ఆఫీసు గదిలోకి వెళ్లి

***'మీరేమైనా చెప్పండి. ఈ పాపంలో ఏదో కొంత భాగం మీకూ ఉంది. తిరుపతికి వెళ్లి తలనీలాలిచ్చి దేవుని దర్శించుకుని హుండీలో కానక వేసి ఆకాశగంగలో మునిగితే ఉన్న పాపాలతో పాటు అన్ని పాపాలూ పోతాయన్నది. భానుమూర్తి నవ్వుతూ 'వెళ్లి పడుకో నీ పిచ్చిగానీ ' అంటూ ఇంకో కట్టనెత్తి ముందు పెట్టుకున్నాడు.***

ఆ మరునాడు సరస్వతి చాలా ఆలస్యంగా లేచింది. జానకమ్మ పలకరించినా పరధ్యానంగా ఉండిపోయింది. చక్రపాణిని చూచి వెక్కివెక్కి యేడ్చింది. ఒళ్లు వెచ్చగా ఉంటే జ్వరం వచ్చిందేమోనని డాక్టర్ కోసం కబురు పంపాడు. డాక్టర్ వచ్చి విశ్రాంతి అవసరమని చెప్పి.. మందిచ్చి వెళ్లిపోయాడు. వారం రోజులు గడిచినా సరస్వతి పైకి లేవలేదు. ఎవరు పలకరించినా ఏదో ఏకాంతంలో నుంచి ఉలిక్కి పడి సమాధానమిస్తుంటుంది. ప్రశ్నకూ జవాబుకూ సంబంధమే వుండదు.

'ఈ కాఫీ త్రాగవే.... ఉదయం నుంచి గుక్కెడు మంచినీళ్ళైనా లేకుంటే ఏమౌతుందో తెలుసా?' జానకమ్మ బ్రతిమాలుతూ అన్నది.

'ఆకాశగంగలో స్నానంచేస్తే అన్ని పాపాలూ పోతాయి. ఉన్న డబ్బునంతా వేంకటేశుని హుండీలో వేస్తే..'

'నిన్నేనే సరస్వతీ కాఫీ త్రాగమంటే ఏమిటీ నీ వాగుడు?' భుజాలను పట్టి కదుపుతూ పైకి లేపింది జానకమ్మ. 'కాఫీనా' గట్టిగా నవ్వింది సరస్వతి.

'ఆ పాలు హంతకుని పైకంతో వచ్చిందా? కాఫీ పొడి గజదొంగ డబ్బుతోనా ? చక్కెర కన్నెపిల్లలను చెరచిన ఏ రౌడీయో యిచ్చిన రూకలతో..'

జానకమ్మకు తల తిరిగిపోయింది.

'పడుకో పడుకో మాట్లాడకేం' అంటూ కూటంలోకి వెళ్లిపోయింది. అప్పుడే జట్‌లో నుండి దిగిన భానుమూర్తి లోపలికి వచ్చి కోటూ గౌనూ

మంచం కోడిపై పడవేశాడు.

'అబ్బీ.. అమ్మాయి విషయం ఏదో చూడకుంటే ..'జానకమ్మను మాట్లాడనివ్వకుండానే 'ఆ.. డాక్టర్ చెప్పారు లేమ్మా. అది హిస్టీరియా. ఉదయం మద రాసుకో వేలూరికో తీసుకెడితే అదే బాగవుతుందిలే 'అన్నాడు భానుమూర్తి.

'హిస్టీరియానా? అంటే..?'

'అదొక జబ్బులేఅని' పెరటిలోనికి దారితీశాడు భానుమూర్తి.

ఆ రాత్రి చక్రపాణి చాలా దీర్ఘంగా ఆలోచించాడు. సరస్వతికి ఏ జబ్బూలేదని అతని అనుమానం. ఆమెలో పాపభీతి అమితంగా వుంది. కాఫీలో పాలు హంతకుని పైకంతో వచ్చింది. కాఫీ పొడి గజదొంగ పైకంతో కొన్నది. చక్కెర కన్నెపిల్లను చెరిచిన ఏ రౌడీయో యిచ్చిన రూకలతోనే కొన్నది. అన్న ధోరణిలోని అంతరార్థం యేమై వుంటుంది. సరస్వతి ఇట్లా అన్నదని జానకమ్మ చెప్పినప్పటి నుంచి చక్రపాణి సతమతమై పోతున్నాడు. అసలు సరస్వతిలో ఇలాంటి అనుమానాలు ఎందుకు ప్రవేశించాయి?

***హంతకులు, రౌడీలు, గజదొంగలు, బ్లాక్ మార్కెటర్లు లంచగొండులూ గుమ్మంలో అడుగుపెట్టడమే తన కిష్టంలేదు. ఆఫీసు గదిలో వెంకటేశ్వరుని బొమ్మను ఉంచడానికి సైతం ఆమె ఆత్మ అంగీకరించడం లేదు.***

***'ఇక్కడ దయ్యాల పటాలు , భూతాల బొమ్మలు, పిశాచాల నృత్య చిత్రాలను ఉంచాలి కానీ దేవుని మూర్తులెందుకు మామయ్యా' అని నవ్వుతూనే దేవస్థానం వారి కేలండర్ని తీసుకెళ్లి కూటంలో తగిలించింది.***

ఉదయం పదింటికే కారు వేలూరుకు బయలుదేరింది. తొమ్మిదోగంటకల్లా ఆస్పత్రిలో అడ్మిషన్ పూర్తి చేశాడు. కోర్టుకు వెళ్లక తప్పదని భానుమూర్తి నాన్నగారి చేతికి రెండువందలిచ్చి కారెక్కాడు.

సరస్వతి కొద్దిగా కోలుకుంటున్నట్లు కన్పించినా సత్తువ మాత్రం దిగజారిపోతున్నది.

పదిహేను రోజులు గడిచాక భానుమూర్తి వేలూరికి ప్రయాణమయ్యాడు. ఆ రాత్రి ఎంతో బలవంతంతో అక్కడే ఆగిపోయాడు. సరస్వతి మాట్లాడుతున్నది కానీ స్వరం మాత్రం చాలా సన్నగిల్లింది. ఆమె మాటల్లో ఎన్నో భావాలు దోబూచులాడుకుంటున్నవి.

***ఆశ్చర్యమేమంటే ప్రతి ఐదు నిమిషాలకు ఆమె ఆకాశగంగను స్మరిస్తుంది. 'ఆకాశ గంగ చల్లని తల్లి అక్కడ స్నానం చేస్తే సర్వ పాపాలు నాశనమవుతాయి. మీరు వెళ్లిరండి. నామాట వినండి. వేంకటేశ్వరుడెంత మంచివాడనుకున్నారు. ఏడు కొండల వాడు ఎంత చక్కని వాడు.'***



***'అవునవును. దొంగలకూ హంతకులకూ బుద్ధి బలాన్ని అమ్ముకోవడం ఆ సంపాదనతో జీవించడం వృత్తి ధర్మం. బాగానే వుంది మామయ్యా. నాకు తెలియక అడుగుతాను. అదే దొంగలకూ హంతకులకూ కండబలం వున్నవాడు తోడ్పడితే శిక్షార్హుడా?'***

'ఇంకా ఉంది నాన్నా పిచ్చి. నెలరోజులైనా ఇక్కడే వుండటం మంచిది' అన్నాడామె మాటలు విన్న భానుమూర్తి. ఐనా అదే నయమవుతుందిలే అనుకుంటూ వెళ్లిపడుకున్నాడు.

ఉదయం ఎనిమిందింటికే ఊరికి వచ్చేశాడు. ఇంటి ముందు కారు ఆగింది. అన్ని తలుపులూ తెరువబడే వున్నవి. ఐదారు మంది పోలీసులున్నారక్కడ. భానుమూర్తి ఆశ్చర్యంతో లోపల అడుగు పెట్టాడు. ఏముంది? అంతా ఐపోయింది. రెండు మూడు క్షణాలలోనే గ్రహించాడు. పాతికవేలు రొక్కం, భార్య నగలు , వంట గదిలో పాత్రలు బీరువాలో బట్టలు.. ఇదేం కలా యదార్థమా! రెండు కళ్లూ నులుముకుని పరిశీలించి చూశాడు. నిజమే. అంతా పోయింది. ఆఫీసు గదిలో లా పుస్తకాలూ , ఫర్నిచరూ , రికార్డులూ తప్ప అంతా ఊడ్చేశారు.

భానుమూర్తి పట్టుతప్పి పేము కుర్చీలో చతికిల పడి పగిలిపోతున్న గుండెల్ని చిక్కబట్టుకొన్నాడు. చెమటపడుతున్నా నాలుక పిడచగట్టుకుని పోతున్నది.

'రాత్రి ఎప్పుడో జరిగినట్లుంది. ఉదయం తెలిసిందే పరుగెత్తుకుంటూ వచ్చామండీ' అన్నాడు కానిస్టేబుల్ ఎంతో సానుభూతిని వ్యక్తం చేస్తూ. భానుమూర్తి ఏమీ మాట్లాడకుండా ఇంటినంతా కలియ చూస్తున్నాడు. వీధివైపే తాళాలను బ్రద్దలు కొట్టి లోపలికి ప్రవేశించినట్లు జాడలు కన్పిస్తున్నాయి. అంతే ఐ వుంటుంది. ఏం చేయాలిప్పుడు? ఆ పాతిక వేలుతో పాటు ఈ పాతిక వేలనూ బ్యాంకిలోనే పడవేసి వుంటే ప్రమాదం తప్పి వుండేది. ఈ ఇన్‌కంటాక్సు వాళ్లు ప్రాణాలను తోడేస్తారు. రొక్కం ఇంత పోయిందన్నా చిక్కే. అయినా ఏదో చెప్పి తప్పుకోవచ్చు. దేనికీ పోయినవన్నీ లిస్టు వేస్తే ! ఎన్ననీ ? ఏవేవనీ? పచ్చనోట్లూ బంగారం తప్ప గుడ్డా గుసురూ చెంబూ గిన్నెల విషయం తనకేం తెలుసు? దేనికీ అమ్మనైనా రమ్మంటే.. ఆమెకు తెలిస్తే కుప్పకూలి పోతుంది. ఇంతకూ ఈ దొంగల్ని పట్టేదెలా? ఈ పోలీసుల కంటే ఆ పోలీసు కుక్కలే నయం కదా? వాటిని తెప్పిస్తే..!

భానుమూర్తి ఆ రోజుల్లా ఈ తతంగంలోనే పూర్తిగా మునిగిపోయాడు. మరునాడు పోయిన పాత్రలు బట్టలు తదితర వస్తు సరంజామానంతా లిస్టు వేయించుకురావడానికి వేలూరికి వెళ్లాడు. సమయానికి చక్రపాణి లేడు. జానకమ్మ మాత్రం సరస్వతి మంచం వద్ద కూచున్నది. భానుమూర్తిని చూచి 'రా నాయనా' అంటూ లేచి నిలబడ్డది.

'అంతా పోయిందమ్మా' అంటూ కూర్చున్నాడు భానుమూర్తి. ఇంట్లో దొంగలు పడి అంతా దోచుకు పోయారన్నాడు భానుమూర్తి.

***'పోయిందా! పీడా పోయింది. ఇప్పుడైనా ఆ మిగిలిందేమైనా వుంటే ఏడుకొండల వాడి హుండీలో వేసి ఆకాశగంగలో మునిగితే ఆ మిగిలిన పాపం..'***

***ఉండలేకపోయాడు భానుమూర్తి. కుడి చేతిని వెనక్కి చాచి గూబపై ఒక్కటి అంటించాడు. సరస్వతి గూబ గుయ్యిమంది. అంత పశుత్వం భానుమూర్తిలో ఎలా ప్రవేశించిందో మరి! ఎక్కడో హృదయంలో మారుమూల సరస్వతి ప్రవృత్తిపై గూడు కట్టుకున్న అసహ్యం అప్రీతి ఏవగింపు ఒక్కసారిగా విజృంభించినవి. జానకమ్మ పట్టుకునే లోగానే ఎడమచేత్తో సరస్వతి మరో చెంపపై పెళ్లున కొట్టాడు.***

ఆ దెబ్బతో ఆమె స్పృహ తప్పి మంచం మీద నుండి క్రిందికి ఒరిగి పోయింది. అప్పుడే హాల్లో ప్రవేశించిన నర్సు భానుమూర్తి రెండవ దెబ్బతో క్రిందపడ్డ సరస్వతిని జానకమ్మ సాయంతో యెత్తి మంచంపై పడుకోపెట్టి నాడిని పట్టి చూచింది. ఆమెకు నాడి చిక్కలేదు. రెట్టించిన ఆందోళనతో డాక్టరు వద్దకు పరుగెత్తింది. ఇంతలో చక్రపాణి వచ్చాడు. అతన్ని చూడగానే జానకమ్మ బావురుమన్నది. భానుమూర్తి కంపిత హృదయంతో కిటికీ ఊచల్ని పట్టుకుని బాహ్య ప్రపంచం వైపు చూస్తూ నిలబడ్డాడు. ప్రాకారం గోడపై అయిదారు కాకులు పిచ్చుక పిల్లను ప్రాణంతోనే చీల్చి వేస్తున్నవి. చూస్తుండగానే

పిచ్చుక రెండు ముక్కలైంది. ఆ ముక్కల్ని ముక్కులతో కరచుకున్న కాకులు పైకి లేచినవి. మిగిలినవి వాటిని అనుకరించాయి.

భానుమూర్తి కారు దగ్గర నిలబడ్డాడు. డ్రైవరు తన్ను సమీపించగానే నాలుగు వంద రూపాయల నోట్లతో పాటు పర్సులో వున్న చిల్లరంతా అతని వద్ద యిచ్చి 'నాన్నగారి దగ్గరిచ్చిరా' అన్నాడు. అతడు లోపలికి వెళ్లగానే తానా వైద్యశాల నుంచి నిష్క్రమించాడు.

సరస్వతి హత్య చేయబడినట్లు స్పష్టంగా గ్రహించిన డాక్టరు పోలీసులకు కబురు చేయకుండా ఉండలేక పోయాడు. హంతకుడామె పురుషుడే కావడం పైగా విద్యావంతుడై ఉండటం అందులోనూ మంచి లాయరుగా పేరు మోసినవాడు కావడం అందరికీ అమితమైన ఆశ్చర్యాన్ని కల్గించింది.

ఆస్పత్రితో పాటు అన్ని వాడలూ గాలించినా హంతకుని జాడ తెలియరాలేదు. అతడు పరారీ అయినట్లు ద్యోతకమైంది. శవపరీక్షానంతరం చక్రపాణి శవాన్ని తీసుకుపోయాడు.

ఇల్లు తాళం వేయబడి ఉన్నా చక్రపాణి పగులకొట్టించాడు. దొంగలు పడ్డ కొంపలో అస్తమించిన గృహలక్ష్మిని చూచిన ఇరుగు పొరుగు వారు ఎన్నో వ్యాఖ్యానాలు చేశారు. లోకంపోకడ అట్టిది.

సరస్వతికి తల్లిదండ్రులు లేకపోయినా అన్న నాగపూరులో ఉద్యోగం చేస్తున్నాడు. అతడూ రాలేదని తేలిపోయింది. ఉన్న బంధు మిత్రులూ, చక్రపాణి కలిసి సరస్వతి శవాన్ని దహనం చేశారు.

భానుమూర్తియే స్వయంగా పోలీసు స్టేషనుకు వెళ్లి తానే తన భార్యను చంపినట్టుగా స్టేట్‌మెంటు ఇచ్చినట్లు తెలిసి ఊరంతా విస్తుపోయారు.

చక్రపాణికీ ఉదంతం తెలిసిన వెనుక కొడుకును కలుసుకున్నాడు. భానుమూర్తి ఎంతో నిగ్రహంగా కన్పించాడు. "బ్యాంకులో డబ్బున్నది. కర్మనంతా సక్రమంగా జరిపించండి. అమ్మను దిగులు పడరాదని చెప్పండి" అని మాత్రం చెప్పాడు.

భానుమూర్తి మిత్రులెందరో వచ్చారు. కానీ అతని దృష్టిని మరల్చలేకపోయారు. కర్మ జరిగిపోయింది. ఇంటిలో పడ్డ దొంగల ఆచూకి మాత్రం దొరకలేదు.

న్యాయమూర్తి భానుమూర్తికి నాలుగేళ్లు కఠిన శిక్ష విధించాడు. హత్య ఉద్దేశ పూర్వకమైనది కాదని పేర్కొన్నా సరస్వతి ప్రాణం పోవడానికి భానుమూర్తి దెబ్బలే కారణమైనందున నాలుగేళ్లు



***ఆశ్చర్యమేమంటే ప్రతి ఐదు నిమిషాలకు ఆమె ఆకాశగంగను స్మరిస్తుంది. 'ఆకాశ గంగ చల్లని తల్లి అక్కడ స్నానం చేస్తే సర్వ పాపాలు నాశనమవుతాయి. మీరు వెళ్లిరండి. నామాట వినండి. వేంకటేశ్వరుడెంత మంచివాడను కున్నారు. ఏడు కొండల వాడు ఎంత చక్కని వాడు.'***

కఠిన శిక్ష విధించడమైనదన్నాడు.

భానుమూర్తి చెఱశాలలో నిబ్బరంగా కూర్చున్నాడు. నెలకోమారు జానకమ్మ, చక్రపాణి జైల్లోనున్న భానుమూర్తిని కలుసుకొంటూనే వున్నారు. భానుమూర్తిలో బాహ్యంగా కన్పించని అదృశ్యశక్తి ఏదియో తన ప్రభావాన్ని విస్తృత పరుచుకుంటున్నది. పైకి మాత్రం లౌకిక దృష్టితో ఆప్యాయంగా తల్లిదఁడ్రుల్ని లాలించి పంపుతున్నాడు.

***అసలీ జీవితానికి నిర్వచన మేమిటి? చావుపుట్టుకల ఆంతర్యమేమిటి? దేవుడున్నాడా? ఉంటే ఎందుకు కన్పించడు. అసలు దేవుని చూడాలనే ఆలోచన తన కింతవరకూ పుట్టలేదెందుకు? దేవుడు తిరుపతిలోనే వున్నాడా? పాపాన్ని నశింపచేసే శక్తి ఒక్క ఆకాశ గంగకే ఉన్నదా? తాను ఘటికాచల యోగాంజనేయుని వరప్రసాదంతో జన్మించానని అమ్మ చెప్పినమాట నిజమేనా? ఇట్లాంటి ప్రశ్నలు వందలు, వేలు, లక్షలు! హృదయాంబుధిలో దధిమర్ధనమే జరుగుతున్నది. అవతరించనున్నది అమృతమో! హాలహలమో !***

బాధ. అనిర్వచనీయ మైన బాధ. ఆ భరింపరాని బాధలోనుంచి ప్రభవించగలిగిన దేమివున్నది? ఒక్క భక్తిమాత్రమే కదా! భానుమూర్తి బంధిఖానాలో భక్తి అనే సూత్రంతో బంధింపబడి తన హృదయ మందిరంలోనే భగవంతుని పట్టి బంధించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఎవ్వరికీ తెలియని , చెప్పినా అర్థంకాని అంతరంగికమైన ఈ అంతర్యుద్ధంలో అతడెన్నో అనుభూతులను పొందగలిగాడు. అనుభవాల నధిగమించిన ఆ యనుభూతులలో అతడనేక సంశయాలను తీర్చుకోగలిగాడు.

సరస్వతి ప్రతిరాత్రీ కాకపోయినా రెండు మూడు రోజులకొకసారి కలలో కన్పిస్తూనే వున్నది.

'ఏండుకొండలవాడా శ్రీ వెంకటేశా! అలిమేల మంగ ఓ ఆకాశ గంగ! ఆకాశగంగా..' తన వీణారవంతో ఈ పాటను విన్పిస్తూనే వున్నది.

స్వప్నానుభూతుల్లో తాను సందర్శిస్తున్న ఈ సత్యాన్ని అతడు లోకానికి చెప్పలేదు. చెబితే నమ్మేవారున్నారా? ఉంటారా? జైలరు సానుభూతి వహించినా అధికారులంతా ఆదరించినా భానుమూర్తిలో మార్పులేదు.

అతడు పరధ్యానంలో గత జీవితంలోని సంఘటనలు నుంచి గుణపాటాలు గుర్తించుకొంటున్నాడు. స్వప్నాలలో భావి జీవితంలోని దివ్య సన్నివేశాలను సందర్శిస్తున్నాడు.

కాలచక్రంలో నాలుగేండ్లు అంతవేగంగా దొర్లిపోగలవని భానుమూర్తి అనుకోలేదు. అతని సత్ప్రవర్తన కారణంగా నలభైరోజులకు ముందే అధికారులు విడుదల చేశారు. ఈ విషయం చక్రపాణికి జానకమ్మకు తెలియదు.

భానుమూర్తి బాహ్య ప్రపంచంలో అడుగుపెట్టినా అతనిలో ఎట్టి ఆనందమూ అంకురించలేదు. దైన్యమూ ప్రవేశించలేదు. ఆస్థితపజ్ఞత ఎట్లా అలవడినదో అతనికే ఆశ్చర్యం! తనకీ లోకంతో పనిలేదు. తనతో ఈ లోకానికి ప్రయోజనమున్నా తాను మునపటి వలె ఉపయోగపడాలనీ అనుకోలేదు. తాను నడిచి పోతున్న దారి నిజానికి ఏ వైపునకు వెడుతున్నదో! తనకు తెలియకనే నడుస్తున్నాడు.

చివరికా దారిలో వెడుతున్న బస్సును చూచి అది తిరుపతి రోడ్డేనని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. సరస్వతి ఏం చెప్పింది? వేంకటేశ్వరుని హుండీలో కానుకేసి ఆకాశగంగలో స్నానం చెయ్యమన్నది. ఆమె చనిపోయిన వెనుక ప్రతి కలలోనూ ఈ మాటే చెబుతున్నది. ఆమె చనిపోయినా ఆమె కోర్కెను తీర్చడం తన కర్తవ్యం! అందుకేగా ఈ నాలుగేళ్లూ జైల్లో ప్రాణాలను నిల్పుకొన్నది. అసలామె చనిపోయిందా? చనిపోయినవారు మళ్లీ స్వప్నాలలో ఎట్లా కన్పిస్తారు? మూడు మాసాల క్రితం జైలు గవాక్షం నుండి క్రిందికి జారుతున్న త్రాచును చూసి 'అదిగో పాము పాము' అని గొంతెత్తి అరచినపుడే గదా తాను మేల్కొన్నాడు. ఎంతటి అపూర్వ సంఘటన అది! బారెడు నల్లని నాగు. క్షణమాలస్యమై ఉంటే తన్నే కాటు



***అసలీ జీవితానికి నిర్వచన మేమిటి? చావుపుట్టుకల అంతర్యమేమిటి? దేవుడున్నాడా? ఉంటే ఎందుకు కన్పించడు. అసలు దేవుని చూడాలనే ఆలోచన తన కింతవరకూ పుట్టలేదెందుకు? దేవుడు తిరుపతిలోనే వున్నాడా? పాపాన్ని నశింపచేసే శక్తి ఒక్క ఆకాశ గంగకే ఉన్నదా? ఇట్లాంటి ప్రశ్నలు వందలు, వేలు, లక్షలు! హృదయాంబుధిలో దధిమర్థనమే జరుగుతున్నది. అవతరించనున్నది అమృతమో! హాలహలమో !***

వేసేదేమో?

ఇంతకూ బ్రతికి వున్నవారెవరూ? చనిపోయి బ్రతికి వున్నదెవరూ? బ్రతికి వుండి చనిపోయినవారెవరు?

భానుమూర్తి పాదాలు నొప్పిపుట్టే వరకూ నడిచాడు. పొద్దుగూకింది. సద్దుమణిగింది. అప్పుడెపుడో కొద్దిగా ఆకలివేసింది. దొంగలకు వకాల్తా పుచ్చుకుని ఉన్న పున్నెమును కూడా ఊడగొట్టుకున్న తనకు అన్నం ఎవరు పెడుతారు? ఆ వీధి మొగుడల యింటిముందే నిలబడి అడిగాడు.

ఆ ఇల్లాలు అన్నపూర్ణ కాకుంటే ఆకు నిండుకూ అన్నం తెచ్చిపెడుతుందా? ఆశ్చర్యమేముంది మరి! వెడుతున్నది తిరుపతికైనపుడు ఏడుకొండల వాడికామాత్రం కరుణలేకుండా వుంటుందా?

***ఎంతో హాయిగా ఆరుబయట వెన్నెల్లో పడుకున్నాడా రాత్రి. మూడవ జాములోనే మేలుకొని చకచకా నడక సాగించాడు. సమాధి స్థితిలోని క్రమాను గత సోపానముల వంటి ఏడుకొండల దారికాదు. అదృష్ట వశాత్తు దైవానుగ్రహంతో ఉన్నట్టుండి ఆత్మసాక్షాత్కారం లభించే మార్గం వంటి దగ్గరి దారి. మంగాపురం దోవ. శ్రీవారి మెట్టు. అలా అలా పైకి వెళ్లి పోయాడు. అలసట కన్పిస్తేనా!***

ఆవైపు నుంచే ఆహ్వానించింది బంగారు కోనేరు. బిచ్చమెత్తాతే తప్పా! భిక్షాటనతోయాత్ర చేసిన వారెందరు లేరు! గంట సేపటికే కావలసినంతకంటే ఎక్కువ పైసలే లభించాయి. మిగిలిన పది పైసలకు కర్పూరం చాలు. అదే పదివేలు. తలనీలాలు సమర్పించి బంగారు కోనేరు వద్దకు వచ్చాడు. ఎందరున్నారక్కడ? వారి విశ్వాసాన్ని ఏమనాలి? తానూ వారిలో ఒక్కడు. కోనేటిలో మునిగాడు.

***ధర్మదర్శనం లభించింది. ఎంత చక్కనివాడు ఏడుకొండలవాడు. సరస్వతి పక్కనే నిల్చొని పాడుతున్నది. అదే పాట. ఆ వీణారవమే! భ్రమ! తిరిగి చూచాడు. ఆమె లేదు. ఎందుకు లేదు? ఉంది. ఉంది. ఆ భావనతోనే హుండీ వద్దకు వచ్చాడు. సరస్వతి అన్నది కదా! హుండీలో కానుక వెయ్యమని! పెళ్లినాడు అత్తగారిచ్చిన ఆ ముద్దుటుంగరాన్ని అందుకే వుంచుకొన్నాడేమో! భానుమూర్తి ఉంగరాన్ని హుండీలో వేశాడు. సరస్వతి చిరునవ్వుతో సాక్షాత్కరించింది. ఎంత సుదినమిది.***

ఇంకేముంది? ఆకాశ గంగ!అన్నం మాటనే మరిచిపోయాడు. ఆకలి ఉంటేనా? ఒక్క ఊపుతో ఆ దిక్కుకేసి నడిచాడు. అదే.. ఆ..కాశ గంగ! ఆ చిన్ని జలపాత స్వరం సరస్వతి మధుర గళాన్నే గుర్తుకు తెస్తున్నది. 'సరస్వతీ! స్నానం చేస్తున్నాను. అన్ని పాపాలు పోయినట్లేనా?' అన్నాడప్రయత్నంగా భానుమూర్తి. సరస్వతి కిలకిలమని నవ్వుతున్నది. ఆకాశగంగ గలగలమని దుముకుతున్నది. ఆమె శ్రుతులను మీటి ఆలాపిస్తున్నది. 'ఏడుకొండలవాస' అదే పాట.

భానుమూర్తి బట్టల్ని పిండుకున్నాడు. లాల్చీ నాలుగు గోచీలైంది. అక్కడే అతి సమీపంలో వటవృక్షచ్ఛాయలో ఆసీనుడయ్యాడు. ఎవరో యాత్రికులు ఆ ముందుంచిన దేదో తనకు తోచినపుడు తింటాడు. ఉదయంసంధ్యల్లో నియమం తప్పక ఆకాశ గంగలో మునుగుతూనే వుంటాడు. పాపం!

ఆ తల్లిదండ్రులెలా ఊహించారో? జైలు నుంచి వెళ్లిపోయాడని తెలిసి పసిబట్టినట్లు ఏడుకొండల నెక్కి వేంకటేశ్వరుని దర్శించి ఆకాశగంగలో సుస్నాతులై ఆ పరిసారాలను గాలిస్తున్నారు.

భానుమూర్తి వచ్చాడు. స్నానం చేస్తున్నపుడే గుర్తించి కౌగిలించుకున్నది తల్లి. చక్రపాణ ఎంతో ఆప్యాయంగా పలకరించాడు. అతడు మాట్లాడలేదు.

బ్రతిమలాడినా మాట్లాడితేగా? అక్కడ కూర్చున్న సాధువు చెప్పాడు. ' ఆయన మహాయోగి. ఎందుకు ఇబ్బంది పెడతారు? ఎవరితోనూ మాట్లాడ'డని. 'నేను తల్లినే, నేను తండ్రినే' అని మొత్తుకున్నారిద్దరూ. ఎవరో బిచ్చగాడు తంబుర మీటుతున్నాడు.

***'తల్లి ఎవరో తండ్రి ఎవరో తనయుడెవరో తెలుసా! తాను ఎవరో దైవమెవరో కానగలమా మనసా!***

***ధర్మమేదో న్యాయమేదో సత్యమేదో మనసా' పాట విన్పిస్తూనేవుంది. ఆకాశ గంగ ప్రణవ స్వరంలో క్రమక్రమంగా లీనమవుతున్న ఆ పాటతో పాటు చక్రపాణి మంచు కరిగినట్లు ద్రవించి పోతున్నాడు. జానకమ్మ సెలయేరు ప్రవహించినట్లు స్రవించిపోతున్నది.***

పద్మాసనాసీనుడైన భానుమూర్తి దక్షిణామూర్తి లా జాజ్జ్వల్యమానుడై భాసిల్లుతున్నాడు వట వృక్షచ్ఛాయలో. సరస్వతి కంఠస్వరం మాత్రం ఆకాశగంగ గలగలారవములో స్పష్టంగా విన్పిస్తున్నది. 'ఏడు కొండల వాస శ్రీ వేంకటేశ అలిమేలు మంగ ఓ ఆకాశ గంగా! ఆకాశ గంగా! ఆకాశ గంగా!

## తిరుపతి కథలు

తెలుగులో పెద్దలు పిల్లలకు చెప్పే కథలన్నీ "కథ కంచికీ .. మనం ఇంటికీ అన్న మాటలతో ముగుస్తాయి. అంటే ఆనాటి జానపద కథలన్నీ చిట్టచివరికి కంచిని చేరుకునేవని గదా అర్థం! కానీ ఈనాటి ఆధునిక తెలుగు కథలన్నీ చివరికో, మొదటకో , ఎప్పుడో పొకప్పుడు తిరుపతికి వస్తున్నాయి. తిరుపతి, తిరుమల , శేషాద్రి కొండలపై వున్న వేంకటేశ్వరుడి ఆలయం తెలుగువాళ్ల సాంఘిక సాంస్కృతిక జీవనంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశాలుగా మారడమే అందుకు కారణం.

అయితే తిరుపతినే నేపథ్యంగా స్వీకరించిన కథలు కొన్ని వున్నాయి. ఈ ప్రాంతంలో పుట్టుకొచ్చిన కథకులు చాలా మంది ఈ ప్రాంతపు నేపథ్యంలో చాలా కథలు రాశారు. ఈ కథలన్నింటినీ చదివేటప్పుడు తిరుపతిలో గత శతాబ్ది కాలంగా వచ్చిన మార్పులంతా మనకు బోధపడుతాయి. ఈ కథల్లో ఆయా రచయితలు చర్చించిన అంశాలు వేరయినా నేపథ్యం మాత్రం తిరుపతే! అందుకే వీటిని "తిరుపతి కథలు" అని పిలుస్తున్నాం.



**- నిర్వహణ**
**మధురాంతకం నరేంద్ర**